

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డిని సన్మానిస్తున్న పారిశ్రామికవేత్తలు

పారిశ్రామికరంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

జీడిమెట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికరంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ కార్యాలయంలో ఐలా, జేఐఏ ఆధ్వర్యంలో ఆమెను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశ్రామికరంగ అభివృద్ధికి సీఎం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని, పెట్టుబడులు తీసుకువచ్చి పారిశ్రామికరంగాన్ని విస్తరించడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఈడీ పవన్‌కుమార్, జోనల్ మేనేజర్ అనురాధా, ఐలా చైర్మన్ సదాశివరెడ్డి, జేఐఏ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, కిశోర్, ఇందుకూరి భాస్కర్‌రాజు, ఏఎల్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేపడుతున్నాం

పేట్‌బషీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలోని వీధి కుక్కలను బ్లూక్రాస్ సొసైటీ ద్వారా 2023 నుంచి నివారణ, స్టెరిలైజేషన్ చేపడుతున్నామని కొంపల్లి పురపాలక సంఘం కమిషనర్ శ్రీహరి తెలిపారు. 'రేవంత్ అంకుల్ వీధి కుక్కల నుంచి కాపాడండి' అని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి సోమవారం కొంపల్లి పురపాలక సంఘం కమిషనర్ శ్రీహరి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 నుంచి 2025 ఫిబ్రవరి వరకు బ్లూక్రాస్ సొసైటీతో ఒప్పందం కుదుర్చుకొని కుక్కలను తరలిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో ఎప్పటికప్పుడు కుక్కల నివారణకు చర్యలు చేపడుతున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కుక్కలను పట్టుకున్న సిబ్బంది

కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎంగా హరి

ఫతేనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎంగా డి.హరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ డీఎంగా పని చేసిన ఇషాక్ బిన్‌మహ్మద్ మెదక్ జిల్లా కార్గోకు బదిలీపై వెళ్లారు. దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డీఎంగా పని చేస్తున్న హరి బదిలీపై కూకట్‌పల్లికి వచ్చారు.



డి.హరి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న చిన్నంగి వెంకటేశం

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

పేట్‌బషీరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నంగి వెంకటేశం ముదిరాజ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులతో కలిసి వినతిపత్రాలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని కోరారు. ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి, ప్రతీ సంవత్సరం వెయ్యి కోట్ల నిధులు కేటాయించి 75 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలు అందించాలన్నారు.

రుణమాఫీని రైతులందరికీ వర్తింప చేయాలి

పేట్‌బషీరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్య పేరుతో నిలిపివేసిన రుణమాఫీని రైతులందరికీ వర్తింపచేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్‌కు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేడ్చల్ జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డిలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి, రైతుల్లో ఆశలను రేకెత్తించి, ప్రభుత్వం ఏర్పాటు చేశాక నిబంధనలు సాంకేతిక లోపం పేరుతో అందరికీ రుణమాఫీ చేయకపోవడం దారుణమన్నారు. పథకంలో లోపాలను చూపుతూ, అసెంబ్లీలో చర్చ పెట్టి కొత్త నిబంధనలు చేర్చడం చూస్తుంటే ఈ పథకాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బౌరంపేట్ సింగిల్‌విండో చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణ, డైరెక్టర్ మధు, చింతల దేవేందర్, మహేష్ ఉన్నారు.



కలెక్టర్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ప్రసంగిస్తున్న పట్నం సునితామహేందర్‌రెడ్డి పక్కనే హరివర్ధన్‌రెడ్డి, రమేష్

కాంగ్రెస్‌లో అందరికీ అవకాశాలు వస్తాయి

బాలానగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ ఎప్పటికీ మర్చిపోదని, అందరికీ అవకాశాలు వస్తాయని మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పట్నం సునీత మహేందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. మూసాపేట నల్ల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకార మహోత్సవానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్‌తో వచ్చి నల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎల్లేశ్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి, పట్టుదల, పోరాట పటిమ, పార్టీ కార్యకర్తల కష్టంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ మీద ప్రతీ కార్యకర్తకు హక్కు ఉందని, తప్పక అవకాశం వస్తుందని అంతవరకు ఓపిక పట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మహిళా నాయకురాలు పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, నాయకులు వేణు, సతీష్‌రెడ్డి, లక్ష్మయ్య, గొట్టిముక్కుల వెంకటేశ్వర్‌రావు, తూము సంతోష్, రాఘవేంద్ర, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అల్లాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెరుల అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో ఇందిరా పార్కు వద్ద దీక్షా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వడ్డెర సంఘం మహిళా కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. వడ్డెరులకు సముచిత న్యాయం జరగాలంటే ఎస్టీ జాబితాలో చేర్చాలని కుంచపు కవిత డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, కొడదాల నరసింహ, మహేశ్వరి, దివ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న కుంచపు కవిత

లోతట్టు ప్రాంతాల్లో బీజేపీ నాయకుల పర్యటన

కేపీహెచ్‌బీకాలనీ: బాలాజీనగర్‌లో లోతట్టు ప్రాంతాలను బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు. వర్షాలకు రోడ్లన్నీ బురదమయం అయి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..

చందానగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి డివిజన్ పరిధిలోని పలు రోడ్లు చిత్తడిగా, అస్తవ్యస్తంగా మారాయి. కొన్నిచోట్ల నడవడానికి వీలు లేని విధంగా బురదమయంగా మారింది. చందానగర్ సర్కిల్ పరిధిలోని పలురోడ్లు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. సర్కిల్ పరిధిలోని పలుకాలనీల రోడ్లు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఏర్పడుతోంది. పలు ప్రాంతాల్లో అడుగు లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు వాపోతున్నారు. లింగంపల్లి రైల్వేబ్రిడ్జి, బీహెచ్‌ఈఎల్ చౌరస్తాకు వెళ్లే దారిలో విశాల్‌మాల్ వద్ద రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. చెన్నారెడ్డి ఆస్పత్రి నుంచి మైహోం వరకు మంజీర పైపులైను కోసం రోడ్డు తవ్వడంతో వర్షాలకు అధ్వానంగా మారాయి. డివిజన్ పరిధిలోని రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



చందానగర్ మంజీర రోడ్డులో అధ్వానంగా ఉన్న రహదారి





బీహెచ్‌ఈఎల్, మంజీర రోడ్డులో రహదారుల దుస్థితి

రెండు కేజీల హాష్ ఆయిల్ స్వాధీనం

మియాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయి (హాష్ ఆయిల్) విక్రయిస్తున్న ముగ్గురిని మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రెండు కేజీల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు సోమవారం తరలించారు. ఇన్‌స్పెక్టర్ దుర్గామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మెట్రోస్టేషన్ బస్టాప్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిస్సాకు చెందిన గోబింద్ బురుడి (21) జగన్నాథ్‌ఖారా(28), లలిత్ బురుడి(20)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద గంజాయి హాష్ ఆయిల్ లభించింది. ఈ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిస్సాలోని మల్కన్‌గిరి, అరకు నుంచి గంజాయిని ఆయిల్‌గా మార్చి నగరంలో విక్రయించినట్లు అంగీకరించారు. ఈ క్రమంలో మియాపూర్ పోలీసులు గోబింద్ బురిడి, జగన్నాథ్ ఖారా, లలిత్‌బురిడిలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 లక్షలు విలువ చేసే హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి

షాపూర్‌నగర్: గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న స్ట్రీట్ వెండర్స్‌కు గుర్తింపు కార్డులు, మార్కెట్టు స్థలం మంజూరి చేయాలని ప్రజావాణిలో సర్కిల్ కమిషనర్‌లకు బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ చండీ శ్రీనివాస్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జంట సర్కిళ్ల పరిధిలో వందల మంది స్ట్రీట్ వెండర్స్‌కి గుర్తింపు కార్డులు లేవని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక నిరుపేద స్ట్రీట్ వెండర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరికి గుర్తింపు కార్డులు మంజూరి చేసే ప్రక్రియను ప్రారంభించాలని బీజేపీ తరుఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌గౌడ్, జ్యోతిరావ్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



సర్కిల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

● **ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ**

చందానగర్ : శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. వివిధ కాలనీల్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, ఫాగింగ్ చేయాలని, పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని ఇందిరానగర్, శాంతినగర్, వేమనవీకర్‌సెక్షన్ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

దేశంలో అంతరించిపోతున్న ఆస్ట్రో ఆసియాటిక్ భాషలు

- ఆ భాషలు మాట్లాడే ఆదివాసీ తెగలపై ఇండో యూరోపియన్ భాషల ప్రభావం
- పారిశ్రామికీకరణ, వలసలే ఇందుకు కారణం
- సీసీఎంబీ తాజా అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, జూలై 22: మన దేశంలో ఆస్ట్రో ఆసియాటిక్ (దక్షిణాసియా దేశాల ప్రజల మూల భాషలు) భాషలను మాట్లాడే ఆదివాసీ తెగలు క్రమంగా ఇండో-యూరోపియన్ (అస్సామీ, బెంగాలీ, కొంకణీ) భాషల వైపు మొగ్గుచూపుతున్నాయని సీసీఎంబీ నిర్వహించిన జన్యు-భాషాపరమైన అధ్యయనంలో వెల్లడైంది. ఒడిశా, చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని ఆదివాసీ తెగలతో పాటు మన దేశంలో దాదాపు 5% మంది ప్రజలు ఆస్ట్రో ఆసియాటిక్ భాషలను మాట్లాడుతారు. దాదాపు 4వేల సంవత్సరాలుగా వీరి భాషలివే. అయితే, క్రమంగా ఈ తెగలపై ఇండో-యూరోపియన్ భాషల ప్రభావం పెరుగుతున్నట్లు సీసీఎంబీ వెల్లడించింది. పారిశ్రామికీకరణ, వలసలు ఇందుకు కారణాలుగా పేర్కొంది. ఈ ధోరణి వల్ల ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడే వారు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఒడిశాలోని భతూడి, భుమ్జి, హో, మహలీ ఆదివాసీ తెగలు మాట్లాడే భాషలో వస్తున్న మార్పులపై సీసీఎంబీ శాస్త్రవేత్త కుమారసామి తంగరాజ్, లక్నోలోని బీర్బల్ సాహ్ని ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త నీరజ్‌రాయ్ తాజాగా అధ్యయనం నిర్వహించారు. ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడే తెగలకు చెందినవారు, ఆ తెగలకు సమీపంలోనే ఉంటూ ఇండో-యూరోపియన్ భాష మాట్లాడే వారి జన్యువులను సరిపోల్చి చూశారు. వీరిద్దరి మధ్య జన్యుభేదం ఉందని నిర్ధారణ అయిందని తంగరాజ్ తెలిపారు. జన్యువులు, భాషకు గల సంబంధంపై సీసీఎంబీ అధ్యయనం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ అధ్యయనం అంతర్జాతీయ జర్నల్ హేలియాన్‌లో ప్రచురితమైంది.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించాలి

కుత్బుల్లాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్‌లో నిర్మించిన పాదచారుల వంతెనను ప్రారంభించాలని, లేని పక్షంలో బీజేపీ నాయకత్వంలో ప్రజల సహకారంతో తామే ప్రారంభిస్తామని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్‌మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్‌లు పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో కుత్బుల్లాపూర్ డీసీ నరసింహ, గాజులరామారం డీసీ మల్లారెడ్డిలకు కాలనీలు, బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందించారు.

పరికిచెరువు బఫర్‌జోన్‌లో కూల్చివేతలు నామమాత్రం

జీడిమెట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్ ప్రాంతంలోని సర్వేనెంబర్ 348/1లో గల పరికి చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను అధికారులు సోమ వారం నామమాత్రంగా తొలగించారు. డీఆర్ఎఫ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులను స్థానికులు అడ్డుకోవడంతో కూల్చివేతలు మధ్యలోనే ఆపేశారు. రెండు బేసిమెంట్లను తొలగించి వెళ్లిపోయారు. జీహెచ్ఎంసీ ఈవీఎండీ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఇటీవల కాలంలో భూదేవిహిల్స్ ప్రాంతంలోని పరికిచెరువును పరిశీలించి, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన అక్ర మ నిర్మాణాలను తొలగిస్తామని ప్రకటించారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి వచ్చిన అధికారులను స్థానిక కార్పొరేటర్ జగన్ సోదరుడు స్థానికులతో కలిసి అడ్డుకున్నారు. డీఆర్ఎఫ్ సిబ్బంది పోలీసులను తీసుకురాకుండా రావడం, స్థానికులు అడ్డుకోవడంతోనే వెళ్లిపోవడం చర్చాంశనీయంగా మారింది. స్థానికులు మాత్రం పరికి చెరువును పరిరక్షించాలని కోరుతున్నారు.



అధికారులను అడ్డుకుంటున్న స్థానికులు

ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు సన్మానం

మియాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆర్యవైశ్య సంఘాల సభ్యులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు ధార లక్ష్మణ్, పబ్బా మల్లేష్, గంప సత్యం, రాజు, శ్రీనివాస్, చిన్న సత్యం, కోటేశ్వరరావు, శ్రీనివాస్, జయకృష్ణ, సంపత్, శ్రీనివాస్, భాస్కర్, బ్రమ్మయ్య, గాయత్రి తెలిపారు.

డివిజన్ సమస్యలపై జడ్‌సీకి వినతి

హైదర్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలు, పెండింగ్ పనులపై ఆమె జడ్‌సీకి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యకరమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పేట్‌బషీరాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల గ్రామానికి చెందిన బేక్ మురళి అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 19న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టు ప్రక్కల తెలిసిన వారి వద్ద వెతికినా ప్రయోజనం లేదు. దీంతో మురళి భార్య అంబిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మురళి

మహాకాళినగరలో తొట్టెల ఊరేగింపు

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్ మహాకాళినగర్‌లో బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్, బీజేవైఎం నాయకులు కిరణ్ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ హాజరై ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దుండిగల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మూడు ముక్కల పేకాట ఆడుతున్న స్థావరంపై బాచుపల్లి పోలీసులు దాడిచేసి, ఏడుగురుని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్‌లు, రెండు సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, రూ.12 వేల 3 వందల 20 నగదును స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌కు ఎదురుగా ఉన్న రియల్‌ఎస్టేట్ ఆఫీసులో కొంత మంది మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నిజాంపేట్‌కు చెందిన కోటపాటి రమేష్, రావి శ్రీనివాసరావు, నిజాంపేట్ బండారి లే-అవుట్‌కు చెందిన సబ్బని కిషోర్, కేశవదుర్గ రాజశేఖర్, కల్లూరి ధర్మారావు, సబ్బని కిరణ్, వసంతం విజయ్‌భాస్కర్‌లను అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్సు స్వాధీనం చేసుకొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కారం

రవీంద్రభారతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. సోమవారం తెలు గు యూనివర్సిటీ ఆడిటోరియంలో రసమయి సం స్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అధికార భా షా సంఘం పూర్వ అధ్యక్షుడు డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు డా.సినారె పురస్కారం ప్రదానం చేశా రు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి లక్ష్మీప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సినారె పురస్కారాన్ని ఆచార్య యార్లగడ్డకు అందజేయడం సముచితమైన నిర్ణయమని అన్నారు. తెలుగు భాష, సాంస్కృతిక వ్యాప్తికి సినారె, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎం.కె.రాము, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్‌గృహకల్ప ఇళ్లలోకి అక్రమ చొరబాట్లను అరికట్టాలి'

నిజాంపేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప ఇళ్లలోకి అక్రమ చొరబాట్లను అరికట్టాలని సీపీఐ నాయకులు నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుకు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాజీవ్‌గృహకల్ప ఇళ్లు నిజాంపేట్ కార్పొరేషన్‌కు వస్తాయని, వాటికి పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, సుధాకర్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాలలో జాబ్‌మేళా

హైదర్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని సిద్ధార్థ కళాశాలలో టెక్ మహేంద్ర ఆధ్వర్యంలో వివిధ రకాల ఎంఎన్‌సీ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళ సోమవారం నిర్వహించారు. ఈమేళాలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు పొందారు. ప్రతీఏటా జాబ్‌మేళ నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు కళాశాల ప్రెసిడెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ జి.భాస్కరరావు, డైరెక్టర్స్ మధుసూదన్‌రావు, ఎస్.అరవింద్‌రావు, ప్రిన్సిపాల్స్ పద్మప్రియ, చంద్రశేఖర్‌నాథ్ పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ బదిలీ

చందానగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఏసీపీగా పని చేస్తున్న మెహ్రా రాజ్‌కుమార్‌ను జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు.

రూ.2 లక్షల రుణం ఇస్తామని.. రూ.1.20 లక్షలు కాజేశారు

లోన్ మోసాలకు పాల్పడుతున్న నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లోన్ ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన మనీష్‌కుమార్(24), ఆకాష్ కుమార్(24), కుందన్‌కుమార్(28), తెలంగాణకు చెందిన వెంకటేష్ మాన్‌జీ రాథోడ్ (21) ముఠాగా ఏర్పడి ప్రముఖ రుణ సంస్థల ప్రతినిధులమంటూ తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. రుణం కావాలని సంప్రదించిన వారి నుంచి జీఎస్టీ, ఎన్‌ఓసీ, పెనాల్టీ పేరుతో అందినకాడికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారు. ధనీ ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్ సంస్థలో పనిచేస్తున్నామంటూ బహదూర్‌పురాకు చెందిన వ్యక్తికి రుణం ఇప్పిస్తామని నమ్మించారు. బాధితుడు రూ. 2లక్షల రుణం కావాలని కోరగా, అతడి నుంచి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్టీ, టీడీఎస్, ఎస్‌జీఎస్టీ, లేట్ పెనాల్టీ, క్లియరెన్స్ ఎన్‌ఓసీ, చెక్ క్లియరెన్స్ చార్జీలు, రీఫండబుల్ అమౌంట్ పేరుతో పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ. 1,20,340 వసూలు చేశారు. బాధితుడు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రావు, ఎస్సై కె.సతీస్‌రెడ్డిల బృందం ఢిల్లీ వెళ్లి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు నమోదయ్యాయని సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

గచ్చిబౌలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ చర్యలకుగాను ప్రతీ సర్కిల్‌కు ఓ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక, పారిశుధ్య విభాగం అధికారులతో వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతులకు మించి నిర్మాణాలు చేపడితే కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటివారైనా ఉపేక్షించొద్దన్నారు. కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు పత్రాలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి, చందానగర్, పటాన్‌చెరు, రామచంద్రపురం, యూసఫ్‌గూడ సర్కిళ్లకు చెందిన పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

● జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం పలు శాఖల అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.